# దూరపు కొండలు

తడిచేతిని చీర కొంగుకు తుడుచుకుంటూ బాల్కనీలోకి వచ్చి నిలబడింది సునంద. అంత క్రితందాకా రణగొణ ధ్వనులతో నిండి ఉన్న ఆ ఇంట్లో ఆ క్షణాన కొద్దిగా ప్రశాంతత చోటు చేసుకుంది.

ఆటల్లో ఫస్ట్ రావాలంటే బోర్న్‌విటా తాగి తీరాలంటూ మొండి కేసి, కాఫీ గ్లాసును తన్నేసి, నాలుగు చీవాట్లు తిని, పిడికెడు మరమరాలు జేబులో పోసుకుని, ఆటలకు పోయిన ఫణి, ఎదురింటి సుషమ వేసుకునే బెల్‌బాటమ్ వంటిది తనకు తొడగందే జరగదంటూ మారాంచేసి, నాలుగు దెబ్బలు పడేసరికి చల్లారిపోయి, పేవ్‌మెంటుమీద రాసులు పోసుకుని చవకగా అమ్మే వాళ్ళ దగ్గర అమ్మ సరదా పడి కొన్న పొడుగు చేతుల చొక్కా వేసుకుని, ఇంటివాళ్ళ పిల్లలతో బొమ్మలాటకు బయలుదేరిన పూర్ణ వీళ్ళ గొడవకు నిద్ర లేచేసి, అర నిద్ర కాగా ఏడ్చి ఏడ్చి ఎలాగో నిద్రలోకి జారిన పాపాయి - దయ తలిచి అనుమతించిన ఈ విశ్రాంతి సునంద పాలిట పెద్ద వరంలాగా కనబడుతూంది.

అరున్నర దాటుతున్నా ఇల్లు చేరని భర్త కోసం ఎదురుచూస్తూ, వీధి చివరికి దృష్టి సారించి నిలబడిన సునందకు తానింకా ముఖం కడుక్కోలేదని చటుక్కున గుర్తు వచ్చింది, అలసటగా ఉన్న తనువు కదలనంటూ మొరాయించినా, జిడ్డు మొహంతో ఎదురయితే భర్త నుండి లభించే దీవెన లందుకోవడం ఇష్టంలేక, బలవంతంగా కదిలి నీళ్ళగది వైపు నడిచింది.

ముఖం కడుక్కుని, బొట్టు కాటుక దిద్దుకుని, నలిగిపోయిన ఆ చీరెనే కాస్త సర్ది కట్టుకుని, మళ్ళీ బాల్కనీలోకి వచ్చి నిలబడింది సునంద.

తనను గురించి ఆలోచించుకోవడానికి గానీ, జీవితాన్ని తరిచి చూసుకోవడానికి గానీ ఆమెకు దొరికే సమయం చాలా తక్కువ. పొద్దున్న లేచింది మొదలు పిల్లల స్నానపానాదులు చూడటం, భర్తకు కావాలసినవి అందించటం, టిఫిన్, వంట ఇత్యాదులన్నీ ముగించి పిల్లలను స్కూలుకూ, ఆయన గారిని ఆఫీసుకూ తరలించే వేళకు ఒక గండం గడుస్తుంది.

అంతలో పుట్టి మునిగిపోయినట్లు ఏడుపు ప్రారంభిస్తుంది చంటిది. పాప సేవ లన్నీ ముగిసేసరికి కడుపులో కామయ్య గంతులేస్తుంటాడు. చల్లారిపోయిన మెతుకులు నాలుగు ఆవురావురుమని తినగానే కళ్ళమీదకు నిద్ర ముంచుకొస్తుంటుంది.

అరగంటైనా గడవక ముందే ఇల్లు పీకి పందిరి వేస్తామంటూ వస్తారు పిల్ల లిద్దరూ, వాళ్లకు అన్నమో, టిఫినో ఏదుంటే అది పెట్టి పంపి, నీళ్లగది నిండా పరుచుకు కూర్చున్న అంట్ల గిన్నెలు కడుక్కుని, బట్టలన్నీ ఉతికి ఆరవేసి, ఇల్లు ఊడ్చి శుభ్రం చేసుకునే వేళకు సాయంత్రం కానే అవుతుంది. మళ్ళీ పిల్లలూ, కాఫీలూ, డ్రెస్‌లూ, పాపాయి ఏడుపూ, ఆ తరవాత దొరికే ఈ గంటసేపూ చాలా అమూల్యమైనది సునందకు.

పెళ్ళి కాకముందు తను కన్న కలలూ, వివాహమైన కొత్తలో కోరుకున్న కోరికలనూ, పిల్లలు పుట్టాక భవిష్యత్తును గురించి పెంచుకుంటున్న అశలనూ, పంచుకుంటున్న బెంగలనూ, అన్నింటినీ ఒకసారి తిరగదోడి చూసుకుంటూ గడిపేస్తుందా కాలాన్ని.

స్కూల్ ఫైనల్ రిజల్ట్సు తెలిసిన రోజునుండి కాలేజీలో చేరడానికి సంబరంగా సిద్ధం కాసాగింది సునంద. అంత దాకా 'ఫలితాలు తెలిశాక చూద్దాంలే' అంటూ వచ్చిన ఆమె తండ్రి పై చదువులు చదివించడం తన వల్లకాదని ఖచ్చితంగా చెప్పేశాడు. ఏడుస్తూ కూర్చున్న కూతుర్ని మెత్తని మాటలతో ఓదార్చ జూసింది సునంద తల్లి.

"నువ్వు బి.ఎ. చదివితే నీకు ఎమ్.ఎ. చదివిన వాడిని తేగల మాఅమ్మా? లక్షణంగా పెళ్ళి చేసుకుని, పిల్లా పాపలతో హాయిగా ఉండక ఎందుకొచ్చిన చదువులు చెప్పు?" అంది.

ఎదురు తిరగాలనిపించినా, ప్రయోజనం ఉండదని గ్రహించి మిన్నకుంది సునంద. ఎదురింటి వారిజ లాగా భర్త నడుము చుట్టూ చెయ్యి వేసి స్కూటర్‌మీద కూర్చుని షికార్లు తిరగవచ్చని ఆశపడిన ఆ అమ్మాయి, కనీసం సాయంత్రంపూట ఇద్దరూ కలిసి నాలుగడుగులు నడిచి, కాసిని మల్లెపూలు కొనుక్కుని ఆనందపడగల రోజులుకూడా అరుదైనవే అని తెలిసిననాడు చిన్నబోయింది.

చిన్నగా నిట్టూర్చింది సునంద. 'ఈ పెళ్ళి లంపటంలోకి దిగకుండా హాయిగా ఉండిపోయి ఉంటే ఎంత బాగుండేది!' మర్నాటికి కాఫీపొడి తెప్పించాలని హఠాత్తుగా జ్ఞాపక మొచ్చిందామెకు. నెలాఖర్లో ఇంట్లోకి వెచ్చాలు తేవాలంటే భర్త చూపించే చీకాకు గుర్తు వచ్చింది. మరోసారి దీర్ఘంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళడానికి ఉద్యుక్తురాలయిన సునంద కాళ్ళకు బంధాలు పడినట్టుగా ఆగిపోయింది.

ఆధునికంగా అలంకరించుకున్న అందమైన ఆడవాళ్ళు ముగ్గురు సందు మలుపు తిరుగు తుండడం చూసి కుతూహలంగా గమనించసాగింది సునంద. ఒక అమ్మాయి కళ్ళు చెదిరిపోయే డిజైన్ ఉన్న టెరీన్ చీరె సింగారిస్తే, మరొక ఆమె జరీ పని చేసిన ఫారిన్ నైలెక్స్ చీరెలో మెరిసిపోతూంది. ఇద్దరికీ నడుమనున్న స్త్రీ జుత్తు అదోక రకంగా తమాషాగా ముడిచిందేమో చాలా స్టైల్‌గా కనబడుతూంది. అందరూ ఏదో మాట్లాడుకుంటూ, మధ్య మధ్య హాండ్‌బాగ్స్ సర్దుకుంటూ, చిరునవ్వులు ఒలకపోస్తూ వెళుతుంటే సునంద కేదో దిగులుగా అనిపించింది.

సరిగ్గా ఆ సమయానికి ఉయలలోని పాప కెవ్వు మనడంతో ఒక్క పరుగున లోపలికి వెళ్ళి కూతుర్ని ఎత్తుకుని తిరిగి అదే చోటికి వచ్చి నిలబడింది సునంద. జరీపని చేసిన ఆ చీరె డిజైన్‌ను తమ కొనుక్కోబోయే చీరె మీద కుట్టించుకోవడానికి గుర్తుంచుకోవాలన్న ఉద్దేశ్యంతో, పాపాయిని గుండెలకు హత్తుకుని, పిట్టగోడ మీదుగా కొంచెం ముందుకు వంగి చూడసాగింది. అలాటి చీరెను కొనాలని మూడేళ్ళుగా అనుకుంటూన్నా ఇంతదాకా కొనలేకపోయిన సంగతీ, ధరలు ఒకటికి రెండింతలైన ఈ రోజుల్లో తన ఆశ అడియాసగా నిలిచిపోయే అవకాశమే ఎక్కువగా ఉన్న విషయమూ ఆ సమయాన సునందకు తోచలేదు.

తల్లి కౌగిలిలోని హాయి ననుభవిస్తున్న పాపాయి కులాసాగా బోసినవ్వు కురిపించింది. అదే క్షణాన తలఎత్తి చూశారా స్త్రీలు. కంగారుపడి తల పక్కకు తిప్పుకుంటున్న సునంద భర్త రాకను గమనించి తలుపు తీయడానికి లోపలికి పరుగు తీసింది.

X X X

కాళ్ళీడ్చుకుంటూ మెట్లెక్కుతున్నదల్లా టెరీన్ చీరె కాళ్ళ కడ్డు పడి, తూలి పడబోయి, తమాయించుకుని తలఎత్తిన కావేరికి పక్కింటి సంజీవమ్మగారి భారీ శరీరం తమ ఇంట్లోంచి బయటకు వస్తుండటం కనబడింది. ఆవిడ పక్కనే ఏనుగు పక్క ఎలుక పిల్లలా వస్తున్న నవనీతమ్మను క్షణం తరవాత చూడగలిగింది. ఆ అమ్మాయికి చెప్పలేనంద నీరసంగా అనిపించింది.

"ఇంత ఆలస్యమయిందేం, అమ్మడూ?" ప్రేమగా ప్రశ్నించిన సంజీవమ్మకు కావేరి కన్న ముందుగా నవనీతమ్మ సమాధాన మిచ్చింది.

"బాగుంది, పిన్నీ! ఆడ మగ నలుగురు కలిసి పనిచేస్తున్న చోట ఒక మాట, పలుకు ఆడకుండా పనికాగానే పరుగెత్తుకు రావటానికి అవుతుందా ఏమిటి?"

చేతిలో ఉన్న పర్సుతో వాళ్ళిద్దరి నెత్తినా మొత్తుదామన్నంత కోపం వచ్చినా, ప్రయత్నం మీద నిగ్రహించుకుని, "మా నాన్న నా కోసమని స్పెషల్ బస్ ఏర్పాటు చేయలేదు కదండీ!" అనేసి లోపలికి నడిచింది.

చీరె మార్చుకుని, పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వంటింట్లోకి వచ్చి ఉస్సురంటూ కూలబడిన కూతురికి కాఫీ అందిస్తూ కాస్త మందలింపుగా అన్నది కావేరి తల్లి!

"కొంచెం పెద్దా చిన్నా చూసుకుని మాట్లాడాలి, కావేరీ, నీ విసుగంతా వాళ్ళమీద చూపిస్తే ఏం లాభం? చదువుకున్నదనీ, ఉద్యోగస్థురాలనీ వల్లమాలిన గర్వమా పిల్లకు అని ఆడిపోసుకుంటారంతే."

"బాగున్న దత్తయ్యా! డిగ్రీలు తెచ్చుకుని, బోలెడు ఆర్జించుకునే కావేరికి కాక నా బోటి దానికి ఉండాలా ఏమిటి గర్వం?" నవ్వుతూనే అంటించింది కావేరి వదిన. ఆవిడ కొడుకు పుట్టిన రోజుకు ఖరీదైన బట్టలు తెచ్చి ఇవ్వలేదని ఆడపడుచు మీద అక్కసుగా ఉన్న దామెకు. 'పెళ్ళా పిల్లలా? ఎవరికి పెట్టాలని సంపాదనంతా? సొంత మేనల్లుడే గానీ పరాయి బిడ్డ కాడే! మీ చెల్లెలికి మరీ పీనాసితనం లెండి' అంటూ కావేరి వినేట్టుగానే మొగుడి దగ్గర గొణిగిందారోజే.

అప్పటి నుండి వదినతో కాస్త ముభావంగా ఉంటున్నది కావేరి. వదిన మాటల్లో వ్యంగ్యం చూసి ఆ పిల్లకు మంట పుట్టింది.

"అవునే, అమ్మా! చచ్చి సున్నమయి ఇంటి కొస్తే వీళ్ళ బోడి ఆరా లేమిటి? నేను చదువుకుంటే, సంపాదిస్తే వీళ్ళకెందుకూ ఏడుపు?" విసురుగా అనేసి సగం తాగిన కాఫీ అక్కడే వదిలేసి లేచిపోయింది.

గదిలోకి వచ్చి పడుకున్న కావేరికి మనసునిండా తెలియని అసంతృప్తి అలముకుంది. 'పెళ్ళికాని ఆడపిల్ల వేసే ప్రతి అడుగు అనుమానపు కళ్ళతోనే చూస్తుంది సంఘం. ఇక చదివి, ఉద్యోగం చేస్తున్న ఆడదంటే అందరి దృష్టి ఆమె మీదనే!'

'ఏమే! అమ్మాయి వచ్చినట్టుంది.. ఏమిటో? తండ్రి నంటూ ఒకడిని ఇంట్లో ఉన్నాను కదా? పలకరించి పోదామనిపించదు దానికి. ఎందుకో ఈ మధ్య కావేరికి మన మెవ్వరం కాబట్టటం లేదు" అంటున్న తండ్రి గొంతు విని ఉలికిపడి లేచి కూర్చుంది కావేరి.

అంతలోనే విరక్తిగా అనుకున్నది! 'ఈయన మాత్రం నా గురించి మహా పట్టించుకున్నట్టు!' కూతురికి ప్రమోషన్ వస్తే, జీతం పెరిగితే గర్వంగా చాటుకోగలడే గానీ, ఆ పిల్లకు ఇరవై ఎనిమిదేళ్ళు నిండుతున్నా పెళ్ళి చేయలేదే అన్న చింతను ఏమాత్రం చూపని తండ్రి మీద ఒక్కొక్కసారి చెప్పలేనంత కోపం వస్తుంది కావేరికి.

తల్లి పోరు పడలేక చూసిన ఒకటి రెండు సంబంధాలూ కట్నం దగ్గర బెసికి పోయాయి. పిల్ల చదువుకున్న నేరానికగాను మరికాస్త ముట్ట జెప్పాలన్నట్టు వ్యవహరించారు. ఇంత చదువుకుని స్వతంత్రంగా బ్రతకగలిగి, తల్లి తండ్రులు తనకు పెళ్ళి చేయలేదని వాపోవడం అవివేకమంటూ మాట్లాడటం సులభమే కానీ, ఆడపిల్లను గడ్డిపోచకన్న తేలికగా చూసే ఈనాటి యువతరం జీవిత భాగస్వామిని ఎన్నుకునేనాడు ఆదర్శంగా, ధైర్యంగా ముందడుగు వేయగలదా?

మొన్నటి రోజున బస్ స్టాండులో తనకు జరిగిన అవమానం ఇంకా మరిచి పోలేదు కావేరి. స్టాప్ దాటి అర ఫర్లాంగు దూరంలో ఆగిన బస్సును అందుకోవాలన్న ఆదుర్దాతో పరుగు తీసింది కావేరి.

"నడవకు నడవకు అంత జోరుగా.. నీ అందాలు చందాలు అలిసిపోయేనూ... నడుమూ నలిగి పోయేనూ..." ఆ అమ్మాయి భుజం మీదుగా వంగి కూనిరాగం తీశాడొక రోమియో. ఫుట్‌బోర్డుమీద కాలు మోపుతున్న దల్లా గిరుక్కున తిరిగి, "ఏయ్, మిస్టర్! బిహేవ్ యువర్ సెల్ఫ్" అన్నది కావేరి కోపంగా.

"పతివ్రతల నవమానించకూడదు, బ్రదర్" అంటూ నవ్వాడొక కుర్రాడు.

"పతిని వెదుక్కునేసరికే సగం తలకాయ పండిపోతుంటే, ఇక వ్రతాలకు టైమేది, గురూ?" చాలా హాస్యంగా మాట్లాడాననుకుని కిచకిచలాడాడు మరొక యువకుడు.

రోషంతో, అవమానంతో ముఖం కందిపోగా, ఘాటుగా ఏదో అనడానికి నోరు తెరిచిన కావేరిని చెయ్యిపట్టి లోపలికి లాగేశారు ఆమె స్నేహితురాళ్ళు.

"వాళ్ళతో వాదిస్తూ కూర్చుంటే మీ కోసం బస్సు ఆగుతుందటమ్మా?" విసుగ్గా అని, దభాలున తలుపు వేసేసి, "రైట్!" అన్నాడు కండక్టర్.

తలుచుకుంటేనే ఒళ్ళు కంపరం పుట్టి మనసు భగ్గున మండింది కావేరికి. పెళ్ళికాని ఆడదానికి ఇంటా బయటా – ఎక్కడా విలువ లేదా?

ఆలోచిస్తూంటే బ్రతుకు నిస్సారంగా తోచి విరక్తి కలిగిందా అమ్మాయికి. 'చదువుకునే రోజుల్లో ఎంత అందమైన ఊహలల్లుకున్నది! తను లెక్చరర్ కావాలని, మరో లెక్చరర్‌నే పెళ్ళాడి, ఇద్దరూ ఒకే చోట ఉద్యోగం చేస్తూ, హాయిగా, దర్జాగా, చీకూ చింతా లేకుండా చిలకా గోరింకల్లా బ్రతకాలని..."

తనతోబాటు పనిచేసే యామిని మనసులో మెదిలింది కావేరికి. 'రోజూ ఆమెను వాళ్ళాయన స్కూటర్ మీద దిగబెడతాడు. సాయంత్రం మళ్ళీ వచ్చి తీసుకు వెళతాడు. పిల్లలను చూసుకోవడానికి, వంటకూ మనిషి ఉన్నదట. ఈ రోజు వాళ్ల వెడ్డింగ్ ఏనివర్సరీ అని జరీబుటాలు కుట్టిన ఫారిన్ నైలెక్స్ చీరె కట్టుకొచ్చింది. ఆ రంగు తనకు బాగుంటుందని, ఖరీ దెక్కువయినా అదే కొన్నాడట. రెండవ ఆటకు టికెట్స్ రిజర్వ్ చేయడానికి ఆఫీసు నుండి అటే వెడతా నన్నాడట, అందుకని తమతోబాటు బస్సులో వచ్చిందీరోజు. ఎంత అదృష్టవంతురాలు యామిని!'

మంచం మీదనుండి దిగి, అల్మైరాలోని అమృతాంజనం సీసా తీసుకుని కొంచెం మందును కణతలకు రుద్దుకుని, గోడవైపు తిరిగి పడుకున్నది కావేరి.

X X X

యామిని ఇంటికి వచ్చేసరికి, మట్టి గొట్టుకుని మాసిపోయిన బట్టల్లోనే గుమ్మం ముందు కూర్చుని నోట్లో పాలపీకను పెట్టుకుని చీకుతున్నాడు ఆమె రెండో కొడుకు. అలా చీకడం వలన వాడి మూతి ముందుకొచ్చేస్తుందని అది వాడి కందనివ్వద్దని ఆయాతో చాలా సార్లే చెప్పింది.

విసుగ్గా లోపలికి వచ్చింది యామిని. హాల్లో మూలన కూర్చుని, కాళ్ళు కొడుతూ, ఊరెగిరిపోయేలా ఏడుస్తూంది పెద్ద కూతురు నీలిమ. కోపంగా బాగ్‌ను టేబులు మీదకు విసిరేసి, "అంజనమ్మా! కాఫీ' అని అరిచి కుర్చీలో కూలబడింది.

"అలా వీధిలో నుండి గావుకేకలు పెట్టకపోతే లోపలి కొచ్చి ఆ అగ్గిపెట్టె ఎక్కడ తగలబడిందో చూచి పెట్టగలిగితే సంతోషం! తరవాత నీ ముద్దుల కూతురికి ఆకూ వక్కా కావాలంట – తెచ్చి పెట్టు.. ఛీ ఛీ! ఏం పిల్లలు? ఏం కొంప? ఆ వంటిల్లాక నరకంలా ఉంది." వంటింట్లో నుండి సుడిగాలిలా వచ్చిన చంద్రమోహన్ దూకుడుగా అన్నాడు.

"అంజనమ్మెక్కడ చచ్చింది? ఇటు వంటిల్లు స్వర్గంలా సర్దుకుంటూ, అటు ఆఫీసులోనూ చాకిరీ చేయడానికి నేను యంత్రాన్ని కాను, మనిషినే. మీలాగే నేనూ అలసిపోయి వచ్చానని మీ కర్థం కాదెందుకని?" అంతకన్న విసురుగా అనేసి, లేచి వచ్చి కూతురి వీపు మీద రెండు చరిచింది. "నీకు వక్కాకు తినడ మెవరు నేర్పారే భడవా? అంజనమ్మేదీ?"

"నువ్వేం నన్ను కొట్టక్కర్లేదు పో! నాకు నువ్వొద్దు, అంజనమ్మే మంచిది." తల్లి చేతిని విసిరికొట్టి పెంకెగా మరి కాస్త గొంతు పెంచింది నీలిమ.

"వాళ్ళ బంధువు లెవరో పోయారట.. పక్కింట్లో పిల్లల్ని వదిలేసి చెప్పి వెళ్ళిందట. పిల్లల్ని మంచి మాటలతో దారికి తేవాలి గానీ, చావబాదితే ఏం ప్రయోజనం? ఒక్క రోజుకే ఆయా కోసం బెంగపెట్టుకోగలదు!" వ్యంగ్యంగా అన్నాడు చంద్రమోహన్.

"కావాలంటే మీరుకూడా ఆవిడ కోసం బెంగ పెట్టుకున్నా నేనేం వద్దనను." తీవ్రంగా భర్త వైపు చూసి గదిలోకి వెళ్ళిపోయింది యామిని. ఆవిడ చీరె మార్చుకుని వచ్చేసరికి చెప్పులు తొడుక్కుని, కూతుర్ని వెంట బెట్టుకుని బయటకు వెళుతున్నాడు చంద్రమోహన్. పెదిమలు బిగించి చూస్తూ నిలబడింది యామిని.

బాగా చీకటి పడ్డాక తిరిగి వచ్చిన చంద్రమోహన్ కూతుర్ని మంచంమీద పడుకోబెట్టి, తాను వరండాలో పడక కుర్చీలో కూర్చున్నాడు.

"భోజనానికి వస్తారా?" యామిని అడిగింది.

"ఆకలి లేదు." ముక్తసరిగా సమాధాన మిచ్చాడు.

"ఆకలి తెలియనంత దిగులు దేని గురించో?" వాడిగా అన్నది.

"అమ్మ ఉత్తరం రాసింది.."

"డబ్బు పంపలేదనీ... పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ వయిపోతున్నావనీ... అలాటివేగా!" అతని మాట పూర్తి గాక మునుపే తేలిగ్గా అన్నది యామిని.

"ఎంత చదువుకున్నా, సంపాదిస్తున్నా అంత ధిక్కారం పనికి రాదు, యామినీ! నీ సంపాదన కోసం వాళ్ళేం కాచుకు కూర్చోలేదే?" ఆవేశంగా అన్నాడు చంద్రమోహన్.

"చదువుకున్నా, సంపాదిస్తున్నా నాకేం ఒరిగిపోవడం లేదు లెండి. పట్టుమని పది రూపాయలు నా ఇష్ట ప్రకారం ఖర్చు చేయకపోయినా, పుట్టింటి వాళ్ళకు దోచి పెడుతున్నానన్న మాట మాత్రం పడుతున్నానంతే. ఇంటా బయటా నలిగిపోతున్నా. సంసారాన్ని, నిర్లక్ష్యం చేస్తున్నానని చెప్పక మానరు. మగమహారాజులు గనక ఇల్లు నరకంలా ఉందని వెళ్ళిపోగలిగారు గానీ, నేనూ మీలాంటి మనిషినేనని ఆలోచించారా? ఛీ! ఏం బ్రతుకు నాది?" యామిని గొంతు గద్గదికమయింది.

"అంత లేసిమాటలెందుకు, యామినీ? ఏమన్నానని అంత రాద్ధాంతం?" విసుక్కున్నాడు.

"ఏనాడైనా ఇంతకన్న సరసంగా మాట్లాడుకున్నామా మనం?" గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళి పడుకున్నది యామిని. అతను బరువుగా నిట్టూర్చడం ఆమెకు వినిపించక పోలేదు.

భర్త నిద్రపోయిన తరవాత నెమ్మదిగా లేచి, కిటికీకి దగ్గరగా కుర్చీని లాక్కుని కూర్చుంది యామిని. క్షణకాలం అతనికేసి చూసి, కనులలో నీరు తిరగగా ముఖం తిప్పుకున్నది.

'ప్రేమించి పెళ్ళి చేసుకున్న తమ మధ్య ఏమిటీ కలతలు? భర్తనూ సంతోష పరచలేక, పిల్లల ఆలనా, పాలనా చూసి క్రమశిక్షణలో పెంచుకోగల అవకాశమూ లేక, తనూ సుఖపడలేక ఎందుకొచ్చిన ఉద్యోగం?'

ఒకరి కిద్దరు సంపాదిస్తున్నా తమకేమీ పెట్టి పోయడం లేదని వాపోయే బంధువులకూ వచ్చి పోయే అతిథులకూ, పైపై ఆడంబరాలకూ, పనివాళ్ళ దుబారాలకూ పోగా ఎప్పుడూ మినిమమ్ బాలన్స్‌లో ఉండే బాంక్ అకౌంటూ, వారానికి ఏదోఒక రకంగా మొలకెత్తి మనశ్శాంతిని హరించే ఈ కలతలూ తలుచుకుంటే యామిని గుండె బరువెక్కింది.

ఆమె కా నిముషంలో, సాయంత్రం ఇంటికి వస్తుండగా, బోసినవ్వుల పాపాయిని ఎత్తుకుని, కలకలలాడుతూ నిలబడి భర్త రాక కోసం ఎదురు చూస్తూ కనబడిన ఇల్లాలు తలపు కొచ్చింది.

'తనకంటూ ఒక ప్రత్యేకతనూ, వ్యక్తిత్వాన్ని మిగుల్చుకోవాలన్న తాపత్రయం చూపక, భర్త ఇష్టాయిష్టాలకనుగుణంగా నడుచుకుంటూ, అతని నీడగా మాత్రమే బ్రతుకుతూ, ఏ బాధ్యతలూ, అశాంతీ లేకుండా తృప్తిగా, నిశ్చింతగా జీవితం గడిపివేయగల దామె. ఎంత అదృష్టం!'

యామినికి నిద్ర రాలేదు.

X X X

పనంతా ముగించుకుని పక్కమీద నడుము వాల్చిన సునంద 'హమ్మయ్య' అనుకున్నది.

'తన కూవస్థ మండూక జీవితంలో మరొక్క రోజు గడిచిపోయింది, రేపొక్క రోజు గడిస్తే ఎల్లుండి ఫస్ట్ తారీఖు. ఈ నెలలోనైనా రెండు చీరెలు తీయమని అడగాలి ఆయనను. ఉన్నవి రెండూ బొత్తిగా అధ్వాన్నంగా తయారయ్యాయి' అనుకున్నది సునంద.

అంతలో ఆమెకు చినిగిన యూనిఫారం వేసుకు వస్తే క్లాసుకు రానివ్వరంటూ గోల పెట్టి, తిండి మానేసి పడుకున్న కొడుకు గుర్తొచ్చాడు. 'పిచ్చి నాయన! నా మాటెలా ఉన్నా పది మందిలో తిరగవలసినవాడు - వాడికి మాత్రం ఎలాగైనా ఒక రెండు జతల బట్టలు తీయాలి' అనుకుంటూ పక్కనే పడుకున్న కొడుకు తల నిమిరింది సునంద.

ఆవిడ కెందుకో సాయంత్రం కనబడిన స్త్రీలు జ్ఞాపకమొచ్చారు. 'దేనికయినా పెట్టి పుట్టాలి.' చిన్నగా నిట్టూర్చిందామె. తరవాత నెల తీరవలసిన అవసరాలకు వచ్చే జీతాన్ని ఎలా సరిపుచ్చడమో ఆలోచిస్తూ అలిసిపోయి కలత నిద్రలోకి జారిపోయింది సునంద.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
తేది : 26-2-1975